క్లుప్తంగా

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి



పెదకాకాని: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. పెదకాకాని సచివాలయంలో సోమవారం గుంటూరు జిల్లా కౌలు రైతుల సంఘం పిలుపు మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తి అవుతున్నప్పటికీ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ పెట్టడం లేదన్నారు. కౌలు గుర్తింపు కార్డు లేకపోవడంతో పంట రుణాలు, పంటల బీమా పథకం రైతులకు వర్తించడంలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, విఠల్ రెడ్డి, బొట్టు శ్రీనివాసరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవి డాక్టర్. కత్తి పద్మారావు జన్మదినోత్సవం



పొన్నూరు: పట్టణంలోని లుంబినివనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో కవి డాక్టర్. కత్తి పద్మారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ప్రముఖ కవి గోరటి వెంకన్న, గద్దర్ కుమార్తె వెన్నెల, శాస్త్రవేత్త డాక్టర్ ఇండ్ల రామసుబ్బా రెడ్డి, కవి కోయి కోటేశ్వరరావు పాల్గొని 'మన దేశం మన రాజ్యాంగం, 'సావిత్రిబాయి పూలే, 'విజయానికి పదకొండు మెట్లు' అనే పుస్తకాలను ఆవిష్కరించారు. అతిథులు మాట్లాడుతూ.. కుల నిర్మూలన లక్ష్యంగా కృషిచేస్తున్న కత్తి పద్మారావు ఆశయాలను ముందుకు తీసుకువెళతామని అన్నారు. అనంతరం కత్తి పద్మారావును సత్కరించారు. కార్యక్రమంలో వేణుమాధవ్, డాక్టర్.కనపర్తి అబ్రహం లింకన్, కోఆర్డినేటర్ కత్తి చేతన్, ఉపాధ్యక్షులు కొరబండి ఆంథోని, చెంగళ రాయులు, నేతల రమేష్, తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకం



పెదకాకాని: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం మిస్సైల్‌మాన్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం ఆశయాలను అమలు చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పలువురు బోధనా సిబ్బంది, అతిథులు దేశభక్తి, విజ్ఞాన విజేతగా ఆయన జీవితం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్ కుమార్, వర్సిటీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్ రవికుమార్, ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన స్వాతి

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు గ్రామంలోగల ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకురాలు స్వాతికి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పెద్దిహరిపద్మరాణి పర్యవేక్షణలో 'ట్రాన్స్‌లేటింగ్ ది 1960స్ తెలుగు నావెల్ రేపటి వెలుగు ఇన్‌టు ఇంగ్లిష్ ఏ స్టడీ ఆఫ్‌ది ఛాలెంజెస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని అభినందించారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం

- సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించారు
- కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి
- వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



వడ్లమూడి గ్రామంలో కూటమి మోసాలను వివరిస్తున్న మురళీకృష్ణ

చేబ్రోలు: సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం, హామీలను అమలు చేయడంలో విఫలమైందని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలంలోని శేకూరుపాలెం, వడ్లమూడి, నారాకోడూరు, గుండవరం, గొడవర్రు గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో అంబటి మురళీకృష్ణ స్థానిక ప్రజలతో కలిసి నేలపై కూర్చొని కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచనలు చేశారు. అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టో కరపత్రాలు విడుదల చేశారు.

ఇచ్చిన హామీల ఊసేలేదు..

మండలంలో ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. కూటమి



శేకూరుపాలెంలో బాబు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను చూపుతున్న అంబటి మురళీకృష్ణ

ప్రభుత్వం ఇస్తానని చెప్పిన ఆడబిడ్డ నిధి నెలకు రూ.1,500లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి.. ఏపీ కూడా ఏడాది అయిన అందించకుండానే అన్నీ ఇచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించిన వీడియోను ప్రజలకు చూపించారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మేయాలని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువకులు ప్రతి వర్గాన్ని కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పేదల మనిషి జగనన్న ఐదేళ్ల పాలనలో ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, కె.ముత్తేశ్వరరావు, భాస్కరరెడ్డి, శేషిరెడ్డి, శంకరావు, షేక్‌జానీ, జయపాల్‌రెడ్డి, తలకాల మస్తాన్, రాజకుమార్, మమత, దానమ్మ, కోటేశ్వరరావు, వెలగా కృష్ణ, దాసరి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో తారస్థాయికి వర్గ విభేదాలు

- పదవుల పంపకాలలో అన్యాయం చేస్తున్నారంటూ ఆగ్రహం
- జనసేన ఇన్‌చార్జ్ వడ్రాణం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పట్టణ అధ్యక్షులు కరిముల్లా

పొన్నూరు: నియోజకవర్గ జనసేన నేతలు సోమవారం పొన్నూరు పట్టణంలోని కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తమ పార్టీలో తమకు జరుగుతున్న అన్యాయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవులు విద్యామండలి, నీటి సంఘాలు, అభివృద్ధి కమిటీలు, మార్కెట్ యార్డు, దేవాలయ కమిటీ, సొసైటీ చైర్మన్ల విషయంలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని జనసేన నాయకులు ఆరోపించారు. చేబ్రోలు, పెదకాకాని, పొన్నూరు మండలం, పట్టణ జనసేన అధ్యక్షులను సంప్రదించకుండానే నామినేట్ పదవులను ఏకపక్ష నిర్ణయాలతో కూటమి పెద్దలు తమ అనుయాయులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. పొన్నూరు జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబుకు స్టేట్ అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ పదవి ఉన్నప్పటికీ మళ్లీ ఆయన శ్రీమతికి పచ్చలతాడిపర్రు సొసైటీ పదవిని ఇచ్చేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని వాపోయారు. జనసేనలో 10 ఏళ్లు కష్టపడిన కార్యకర్తలు కోరుకుంటున్న పొన్నూరు మండలంలోని మునిపల్లె, చేబ్రోలు మండలంలోని వేజెండ్ల సొసైటీ చైర్మన్ పదవులను కార్యకర్తలకు ఇప్పించకుండా మార్కండేయబాబు తన స్వలాభం కోసం పచ్చలతాడిపర్రు సొసైటీ కోసం పాకులాడటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జనసేన నాయకులకు గౌరవం దక్కడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి వల్లంశెట్టి శ్రీధర్‌బాబు, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, జిల్లా కార్యదర్శి మేకల రామయ్య, పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల పార్టీ అధ్యక్షులు నాగిశెట్టి సుబ్బారావు, చందు శ్రీరాములు, వీరెళ్ల వెంకటేశ్వరరావు, వెల్లలూరు గ్రామ అధ్యక్షుడు సూదా వసంతి, మండల ఉపాధ్యక్షుడు యక్కటి రామయ్య, రంగా సేవా సమితి అధ్యక్షుడు మాదాసి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ దర్గా సందర్శన



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

పెదకాకాని: బాజీ బాబా దర్గాను రూ.2 కోట్ల నిధులతో ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. పెదకాకాని హజరత్ బాజీ షాహీద్ అవులియా దర్గాను సోమవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు దర్గా ఈవో షేక్ ఖాజా మస్తాన్, సిబ్బంది స్వాగతం తెలిపారు. ముందుగా బాజీ బాబా దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో చైర్మన్ పాల్గొన్నారు. దర్గా ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. 537 సంవత్సరాల చరిత్ర ఉన్న బాజీ బాబా దర్గాకు రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయన్నారు. దర్గాలో ఆ స్థాయిలో అభివృద్ధి జరగడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో దర్గా నిధులతో సీసీరోడ్డు, ప్రహరీగోడ నిర్మించడం అభినందనీయమన్నారు. దర్గా ప్రాంగణంలో ఉచితంగా ఆర్వో ప్లాంట్, మినీ పార్కు ఏర్పాటు చేయడంతో పాటు ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. దర్గాలో మరుగుదొడ్ల వద్ద డబ్బులు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్ షేక్ హుస్సేన్, దర్గా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



పొన్నూరు: వివిధ సమస్యలపై మండల పరిధిలోని ప్రజల నుంచి తీసుకుంటున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుంచి 7 అర్జీలను తీసుకున్నారు. వాటిలో రెవెన్యూ 3, సర్వే 1, ఆర్‌అండ్‌బీ 2, హౌసింగ్‌కు సంబంధించి స్వీకరించిన 1 అర్జీని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఈవోపీఆర్‌డీ మల్లికార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వైస్ ఛాన్సలర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ఆర్థిక సౌజన్యంతో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్యలు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ.. హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కూడా కుదిరిందని వైస్ ఛాన్సలర్ పి.నాగభూషణ్ తెలిపారు. అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావుతో వైస్ ఛాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. ఈ అవగాహన ఒప్పందం వల్ల ప్రస్తుతం రక్షణ, అంతరిక్ష రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, ఇండస్ట్రీ–అకాడెమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని చౌడవరం గ్రామంలో గల ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని.. ప్రతి జీవి మనుగడ ప్రకృతి పరిరక్షణపైనే ఆధారపడి ఉందని వారు తెలిపారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధ్వర్యంలో మొక్కలు నాటి, ర్యాలీని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రకృతి పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ కోఆర్డినేటర్స్ డాక్టర్ ఇ.నాగేశ్వరరావు, డాక్టర్ కె.ఉపేంద్రచౌదరి, డాక్టర్ డి.కొండలరావు, డాక్టర్ ఎం.అనిత, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా లావు రత్తయ్య జన్మదినోత్సవం



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని పెదపలకలూరు రోడ్డులో గల విజ్ఞాన్‌నిరుల ప్రాంగణంలో సోమవారం విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య 73వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలతో ఆరంభమైన ఈ వేడుకలలో విజ్ఞాన్ హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ సీఈవో డాక్టర్ లావు మేఘన, విజ్ఞాన్ సంస్థల శ్రేయోభిలాషి శ్రీ కూర్మనాథం, విజ్ఞాన్ పూర్వ విద్యార్థి, విజ్ఞాన్ వైజాగ్ విద్యాసంస్థల సీఈవో శ్రీకాంత్, మరో పూర్వ విద్యార్థి సుభాష్ శ్రేయోభిలాషులు రత్తయ్యతో కేకులు కట్‌చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజ్ఞాన్ నిరుల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేసినట్లు విజ్ఞాన్ నిరుల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక తెలిపారు.

దోమల నివారణకు గంబూషియా చేపలు



చేపలను పంపిణీ చేస్తున్న అధికారులు

పొన్నూరు: గంబూషియా చేపలతో దోమల పుట్టుకను నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ అన్నారు. సోమవారం నిడుబ్రోలులోని మత్స్య కేంద్రం జిల్లా అధికారి సైదా నాయక్ సహకారం, మత్స్య కేంద్రం సహకారంతో స్థానిక మలేరియా సబ్ యూనిట్‌కు గంబూషియా చేపలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఈ చేపలను నిలకడగా ఉన్న నీటిలో విడుదల చేయడం ద్వారా అవి దోమ లార్వాలను తింటాయని తెలిపారు. ఫలితంగా దోమల ఉత్పత్తి తగ్గి వాటి ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గునియా, బోదకాలు, మెదడు వాపు వ్యాధి, చికా వైరస్ వంటి వ్యాధుల వ్యాప్తిని తగ్గించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, అభివృద్ధి అధికారి మహమ్మద్ జయనుల్లా ఖాన్, మలేరియా సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలకు ఎన్‌బీఏ టైర్ వన్ గుర్తింపు



మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ సుబ్బారావు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు టైర్ వన్‌లో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. స్థానిక కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో సోమవారం చైర్మన్ మాట్లాడారు. అర్హత ఉన్న అన్ని బ్రాంచీలకు (సీఎస్‌ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ) గుర్తింపు లభించిందన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకూ మూడో సారి ఇలాంటి ప్రతిష్టాత్మకమైన ఎన్‌బీఏ గుర్తింపు కళాశాలకు దక్కినట్లు తెలిపారు. ఈ విజయంలో తమకు సహకరించిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ.. జాతీయ సంస్థలు తమ కళాశాలకు ఇస్తున్న గుర్తింపు తమ కళాశాల నాణ్యాతా ప్రమాణాలకు ప్రతీక అని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు తహసీల్దార్‌గా సుజాత



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్‌గా జి.సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జి.కరుణకుమార్ ఆర్డీవో కార్యాలయం ఏవోగా బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో తుళ్లూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుజాతను ప్రత్తిపాడుకు నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సుజాత విధుల్లో చేరారు.

జీటీఎస్ పనులు వేగవంతం చేయండి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కంపోస్ట్ యార్డులో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఏటుకూరు రోడ్‌లోని కంపోస్ట్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఆగస్ట్ ఒకటి నుంచి ప్రతి ఇల్లు, కమర్షియల్ సంస్థల నుంచి ప్రజారోగ్య కార్మికులు తడిపొడిగానే వ్యర్థాల సేకరణ జరుగుతుందన్నారు. ఆగస్ట్ ఒకటి నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంటుందని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని కాకానిరోడ్, పొన్నూరు రోడ్డులో రోడ్ల, డ్రెయిన్లపై ఆక్రమణలను మూడు రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే పట్టణ పట్టణ ప్రణాళిక సిబ్బందే తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హెపటైటిస్‌పై అవగాహన ర్యాలీ



ప్రారంభిస్తున్న డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ హెపటైటిస్ డే సందర్భంగా సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొని హెపటైటిస్ నివారణ నినాదాలు చేశారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్ నుంచి నాజ్ సెంటర్ మీదగా తిరిగి జీజీహెచ్ వరకు ర్యాలీ కొనసాగింది. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారి హెపటైటిస్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. క్యాంప్ ద్వారా 500 మంది ఆరోగ్య సిబ్బందికి హెపటైటిస్ వ్యాక్సిన్ వేశారు. అనంతరం జరిగిన సభలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీజీహెచ్‌లో నేషనల్ వైరల్ హెపటైటిస్ ప్రోగ్రాం జరుగుతోందని, దీని ద్వారా 4 వేల మంది హెపటైటిస్ బీ వ్యాక్సిన్, 2500 మందికి హెపటైటిస్ సి వ్యాక్సిన్ ఉచితంగా వేశారన్నారు. జీజీహెచ్‌లో లభిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వయంగా ఎమ్మెల్యే హెపటైటిస్ బీ టీకా వేయించుకున్నారు. ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఇప్పటి వరకు 50వేల మందికి పైగా హెపటైటిస్ బీ స్క్రీనింగ్, 50 వేల మందికి పైగా హెపటైటిస్ సీ స్క్రీనింగ్ చేసి వ్యాక్సిన్లు, మందులు, అవసరమైన వారికి ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణ, పీజీ వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్, పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా అర్జీల పరిష్కారం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 28 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకున్నారు. పీజీఆర్‌ఎస్ ద్వారా పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున మొత్తం 41 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, ఎంటహెచ్(ఇన్‌చార్జి)లు రామారావు, సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

రజక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలి

నెహ్రూనగర్: నగరంలో రజక కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దారుల సంఘం ఉపాధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సీబీఆర్‌ఎస్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల వివాహాది, ఇతర శుభ కార్యాలయాలకు, సామాజిక సంక్షేమ సమావేశ నిర్వహణ కోసం స్థలం కేటాయిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు.

ఏఎన్‌యూలో ఉచిత కంటి వైద్య శిబిరం



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రంలో సోమవారం మెడెక్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించినట్లు వర్సిటీ వైద్యాధికారి డాక్టర్ రమణమూర్తి తెలిపారు. ఈ శిబిరాన్ని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య రత్నశీలామని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమం ఆరోగ్యం దృష్ట్యా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది విద్యార్థులు, ఉద్యోగులు కంటి వైద్య పరీక్షా సేవలను వినియోగించుకున్నారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా కంటి చుక్కల మందు, మందులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైద్య అధికారులు డాక్టర్ జిమ్మీరాణి, డాక్టర్ రమణమూర్తి, మెడెక్స్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మాధవిలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.